క్లుప్తంగా...

ముగిసిన రామానుజ ఉత్సవాలు



గౌడవెల్లిలో రామానుజ రథోత్సవం

మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి గ్రామంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న రామానుజ తిరు నక్షత్ర ఉత్సవాలు బుధవారం ముగిశాయి. బుధవారం స్వామి వారి రథోత్సవాన్ని నిర్వహించారు. ఆలయం నుంచి ప్రధాన వీధుల్లో భక్తులు స్వామి వారి రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్ గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అన్ని వార్డుల అభివృద్ధికి కృషి



రోడ్డు పనులు ప్రారంభంలో చైర్ పర్సన్ దీపిక

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలోని అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి అన్నారు. పట్టణంలోని 12వ వార్డు ఆర్టీసీ కాలనీలో రూ.10 లక్షల మున్సిపల్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. అన్ని వార్డుల్లో సంపూర్ణ సీసీ రోడ్లు, సంపూర్ణ డ్రైనేజీ ఏర్పాటు చేసేందుకు సరిపడా బడ్జెట్ కేటాయిస్తున్నట్లు తెలిపారు. ప్రతి వార్డులో అన్ని వసతులు కల్పించేందుకు కార్యచరణ రూపొందించి అమలు చేస్తున్నట్లు తెలిపారు. వైస్ చైర్మన్ రమేష్, కౌన్సిలర్ ప్రియాంక మధుకర్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికురాలి కుటుంబాన్ని ఆదుకోవాలి

ఘట్‌కేసర్: చౌదరిగూడలో బుధవారం మృతి చెందిన పారిశుద్ధ్య కార్మికురాలు శోభ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకుడు యాదయ్య, మండల నాయకురాలు సబిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మృతురాలి నివాసంలో కుటుంబ సభ్యులను పరామర్శించి మృతదేహానికి నివాళులర్పించారు. 18 ఏళ్లుగా పంచాయతీలో ఆమె ఎనలేని సేవలు అందించారన్నారు. కార్మికులకు ప్రమాద బీమా, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలి కోరారు. నాగేశ్, కార్మికులు చంద్రమౌళి, నరసింహ, యాదమ్మ, కనకరాజు, లక్ష్మణ్, లక్ష్మీ, చంద్రకళ, మైసమ్మ, కృష్ణ పాల్గొన్నారు.

లింగాపూర్‌లో కంటి వెలుగు

మేడ్చల్: లింగాపూర్ గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ రజితరాజమల్లారెడ్డి ప్రారంభించారు. పరీక్షలు చేసి అవసరమైన వారికి వైద్యులు కంటి అద్దాలు సూచించడంతో అద్దాలను ఎంపీపీ అందజేశారు. అందరూ పరీక్షలు చేయించుకొని, అవసరమైతే అద్దాలు పొందాలన్నారు. సర్పంచ్ లక్ష్మీ సంజీవ, పీఏసీఎస్ చైర్మన్ సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న కౌన్సిలర్ చింతల రాజశేఖర్

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనర్సింహస్వామి కాలనీకి చెందిన నానావత్ శాంతి బాయి అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ విషయం తెలుసుకొన్న స్థానిక కౌన్సిలర్ చింతల రాజశేఖర్ బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. తాను ఇచ్చిన నగదును వైద్య ఖర్చులకు వినియోగించుకొని, అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవాలని ఆమెకు చెప్పారు. సంఘ సేవకులు, డీఎస్ఆర్ ప్రాపర్టీ చైర్మన్ శ్రీరాములు, డీటీ నాయక్, జాను నాయక్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

తల్లీకొడుకు అదృశ్యం



రేణుక(ఫైల్)

జవహర్‌నగర్: తల్లీ కొడుకు అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ చంద్రపురి కాలనీలో నివసించే యాదగిరి, భార్య రేణుక(39)తో ఒక కుమార్తె, ఇద్దరు కుమారులతో కలిసి ఉంటున్నారు. కొన్ని రోజులుగా భార్యభర్తలు ఇద్దరు గొడవలు పడుతుండేవారు. 25వ తేదీన రేణుక తన కొడుకుతో కలిసి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రేడ్ లైసెన్స్ లేకుండానే..

జోరుగా వ్యాపారాలు

- షాపులు అధికం.. లైసెన్స్‌లు కనిష్టం
- పురపాలికల్లో ఆదాయానికి భారీగా గండి
- ఆదాయం పెంచడంలో యంత్రాంగం విఫలం
- ప్రతిఏటా ఏప్రిల్‌లో పునరుద్ధరణ తప్పని సరి
- పట్టించుకోని పురపాలకులు



సాక్షి, మేడ్చల్ జిల్లా: పురపాలక సంఘాల పరిధిలో ఎక్కడ పడితే అక్కడ వివిధ రకాల వ్యాపార సముదాయాలు ఉన్నప్పటికీ ఆ స్థాయిలో ట్రేడ్ లైసెన్సులను వ్యాపారులు తీసుకోవడం లేదు. దీంతో పురపాలక సంఘాలకు ప్రతిఏటా పెద్ద ఎత్తున ఆదాయానికి గండి పడుతోంది. నిబంధనల ప్రకారం ఏ దుకాణం నడపాలన్నా.. ట్రేడ్ లైసెన్సుకు పురపాలక సంఘాలకు తప్పని సరిగా వ్యాపారులు తగిన రుసుము చెల్లించి తీసుకోవాల్సి ఉంటుంది. కాగా.. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 13 పురపాలక సంఘాల్లో ట్రేడ్ లైసెన్స్ పొందాలని మున్సిపల్ అధికారులు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినప్పటికీ, లక్ష్యానికి దూరంగానే ఉంటున్నాయి. పురపాలక సంఘాల్లో వ్యాపార సముదాయాలు ఉన్నంతగా వ్యాపారులు లైసెన్సులు పొందడం లేదు.

ట్రేడ్ లైసెన్సులు జారీ చేయలేదా..?

మేడ్చల్ జిల్లా పరిధిలోని బోడుప్పల్‌లో 2,035 వ్యాపార సముదాయాలు ఉండగా, ట్రేడ్ లైసెన్సులు పొందిన దుకాణాలు(షాపులు) 455 మాత్రమే ఉన్నాయి. నిజాంపేటలో 4,354కు గానూ 2,135, జవహర్‌నగర్‌లో 750 గానూ 282, దుండిగల్‌లో 1248 గానూ 432, కొంపెల్లిలో 1,047 గానూ 256, నాగారంలో 1,211గానూ 265, పోచారంలో 411 వ్యాపార సముదాయాలకు గానూ 173 షాపులకు మాత్రమే ట్రేడ్ లైసెన్సులు ఉన్నాయి. ఈ ఏడు పురపాలక సంఘాల్లో మొత్తంగా 11,056 వ్యాపార సముదాయాలు ఉన్నట్లు మున్సిపల్ ఉద్యోగులు గుర్తించినప్పటికీ, ట్రేడ్ లైసెన్సులు 3,998 షాపులకు మాత్రమే ఉన్నాయి. దీన్ని బట్టి మున్సిపల్ అధికారులు గుర్తించిన మొత్తం దుకాణాల్లో కూడా 7,058 వ్యాపార సముదాయాలకు ట్రేడ్ లైసెన్సులు జారీ చేయలేదని తెలుస్తోంది. దీంతో పురపాలికల్లో ట్రేడ్ లైసెన్సుల జారీ విధానం ఎలా ఉందనే విషయం విధితమవుతోంది. అలాగే, మిగతా పీర్జాదిగూడ, దమ్మాయిగూడ, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, మేడ్చల్, తూముకుంట పురపాలక సంఘాల్లో కూడా ట్రేడ్ లైసెన్స్ జారీ విధానం సక్రమంగా లేదన్న విషయం స్పష్టమవుతోంది.

ఆదాయానికి లక్షల్లో గండి

బ్యాంకులో రుణం తీసుకున్న వారు తప్ప మిగతా వ్యాపార సముదాయాలకు సంబంధించిన వారు ట్రేడ్ లైసెన్సులు పొందడానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో పురపాలక సంఘాల ఆదాయానికి భారీగా గండి పడుతోంది. దీనిపై అధికార యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం ద్వారా పురపాలక సంఘాల్లో మరింత ఆదాయాన్ని పెంచాల్సిన అవసరం ఉంది. రోడ్ల వెంబడి హోటళ్లు, రెస్టారెంట్లు, ఆస్పత్రులు, కిరాణా దుకాణాలు, సెల్ పాయింట్లు, మొబైల్ షోరూంలు, వస్త్ర దుకాణాలు, ఆన్‌లైన్ సెంటర్లు తదితర వాణిజ్య సంస్థలు భారీగా పెరిగిపోయాయి. రోజురోజుకూ వ్యాపార, వాణిజ్య సంస్థలు పెరిగిపోతున్నా.. చాలామంది నిర్వాహకులు ట్రేడ్ లైసెన్స్ పొందడం లేదు. దీంతో పురపాలక సంఘాల ఆదాయానికి లక్షల్లో గండి పడుతోంది.

విలీన గ్రామాల్లో అంతంతే...

పురపాలక సంఘాల పరిధిలో ఉన్న విలీన గ్రామాల్లోనూ పెద్ద ఎత్తున దుకాణాలు, వ్యాపార వాణిజ్య సంస్థలు పెరుగుతూనే ఉన్నాయి. గతంలో ఉన్నవాటికి రెట్టింపు సంఖ్యలో కొత్తగా దుకాణాలు, వాణిజ్య వ్యాపార సంస్థలు వెలిశాయి. ఇందులో చాలా వాటికి ట్రేడ్ లైసెన్సులు పొందకుండానే వ్యాపార సముదాయాలను నిర్వహిస్తున్నారు.

రహదారుల ఆధారంగా రుసుం

పురపాలక సంఘాల పరిధిలో వ్యాపారం నిర్వహించుకునేందుకు విస్తీర్ణంతో సంబంధం లేకుండా ఫీజులు చెల్లించేవారు. కాగా ప్రభుత్వం మున్సిపాలిటీలకు ఆదాయం పెంచే ఉద్దేశంతో జీవో నంబరు 147 జారీ చేసింది. దీనిప్రకారం 20 అడుగులలోపు ఉన్న రోడ్డును సింగిల్ లేన్, 30 అడుగులలోపు ఉన్న రోడ్డును డబుల్ లేన్, 30 అడుగుల కంటే ఎక్కువగా ఉన్న రోడ్డును మల్టీపుల్ లేన్‌గా విభజించారు. ఆయా రోడ్లకు ఇరువైపులా ఉన్న దుకాణాల విస్తీర్ణాన్ని బట్టి చదరపు అడుగుకు కనిష్టంగా రూ.3, గరిష్టంగా రూ.7 చెల్లించి లైసెన్స్ తీసుకోవాలని నిబంధన పెట్టారు. దీంతో చాలామంది దుకాణాల నిర్వాహకులు లైసెన్సులు తీసుకునేందుకు ముందుకు రావడం లేదు. ప్రతి సంవత్సరం ఏప్రిల్‌లో దుకాణాల నిర్వాహకులు తప్పనిసరిగా ట్రేడ్‌లైసెన్సు పునరుద్ధరించుకోవాలని పురపాలక సంఘాల కమిషనర్లు పేర్కొంటున్నారు. లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

కాంగ్రెస్‌లో ఎవరికి వారే..

మేడ్చల్ చెక్‌పోస్ట్ వద్ద రేవంత్ కోసం వేచి ఉన్న హరివర్ధన్‌రెడ్డి వర్గం



వివేకానంద విగ్రహం వద్ద వేచి ఉన్న వజ్రేష్‌యాదవ్ వర్గం



- మూడు గ్రూపులుగా మేడ్చల్ కాంగ్రెస్
- పార్టీ అధ్యక్షుడు వస్తే ఎవరికివారే స్వాగతం

మేడ్చల్: రాజకీయ పార్టీలలో కాంగ్రెస్ పార్టీ రూటే సెపరేటు.. అందులో నాయకులకు అంతర్గత ప్రజాస్వామ్య స్వేచ్ఛ మిగతా పార్టీలకంటే అధికమే.. పీసీసీలో నాయకులు తలో దారిలో ఉండగా వారి అడుగు జాడల్లోనే మేడ్చల్ నాయకులు నడుస్తున్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మూడు ముక్కలుగా ఉంది. మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ రాజకీయాలకు దూరంగా ఉంటూ తనకంటూ ఓ వర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. పీసీసీ అధికార ప్రతినిధి నియోజకవర్గ కో ఆర్డినేటర్ హరివర్ధన్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ వజ్రేష్‌యాదవ్ చెరో గ్రూపును ఏర్పాటు చేసుకున్నారు. కేఎల్ఆర్ తన మద్దతుదారులతో సెపరేటుగా ఉండగా హరివర్ధన్‌రెడ్డి, వజ్రేష్‌యాదవ్‌లు జోరుగా గ్రూపు రాజకీయాలు నడిపిస్తున్నారు. పార్టీ చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్రను నియోజకవర్గంలో ఇద్దరు నాయకులు ఎవరికి వారు వేర్వేరుగా నిర్వహిస్తున్నారు. పార్టీ కష్టకాలంలో ఉండి అపసోపాలు పడుతుంటే నాయకులు మాత్రం ఎవరికివారే అన్నట్లుగా ఉంటున్నారు. వజ్రేష్, హరివర్ధన్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే టికెట్ తమకే వస్తుందని ఆశతో జోరుగా నియోజకవర్గంలో తిరుగుతున్నారు. కార్యకర్తలు, నాయకులు రెండు గ్రూపులుగా విడిపోయి మేడ్చల్‌లో రెండు కాంగ్రెస్ పార్టీలను ఏర్పాటు చేసుకుని రాజకీయం చేస్తున్నారు.

రేవంత్‌రెడ్డికి ఎవరికివారే స్వాగతం పలికి..

బుధవారం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు మేడ్చల్ మీదుగా వెళ్లగా మేడ్చల్‌లో కాంగ్రెస్ నాయకులు ఎవరికి వారు స్వాగతం పలికి తమ ఐక్యత లేదని మరోసారి తెలియజేశారు. హరివర్ధన్‌రెడ్డి వర్గం మేడ్చల్ చెక్‌పోస్ట్ వద్ద తన అనుచరులతో స్వాగతం పలకగా, వజ్రేష్‌యాదవ్ తన అనుచరులతో వివేకానంద విగ్రహం వద్ద స్వాగతం పలికారు. రెండు వర్గాల నాయకులు రెండు గ్రూపులుగా విడిపోయి తమ అధ్యక్షుడికి స్వాగతం పలికారు. ఓ వైపు అన్నిరకాల బలాలు ఉన్న మంత్రి మల్లారెడ్డి ఉండగా ఆయనకు పోటీగా ఐక్యతతో పోరాడాల్సిన కాంగ్రెస్ నాయకుల మధ్య ఐక్యత లేకపోవడంతో పార్టీ నాయకులు గ్రూపులుగా చీలిపోతూ పార్టీని బలహీనపరుస్తున్నారు.

రేవంత్‌రెడ్డి ఘన స్వాగతం..

ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వెళ్తున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి మేడ్చల్‌లో కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. రోడ్డు మార్గంలో 44వ జాతీయ రహదారిపై వెళ్తున్న రేవంత్‌రెడ్డిని వివేకానంద విగ్రహం వద్ద నాయకులు నిలిపి ఘనస్వాగతం పలికారు. భారీ గజమాలతో క్రేన్ సహాయంతో వేసి స్వాగతం పలికి ఆయన వెంట బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి హరివర్ధన్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధికార ప్రతినిధి సురేందర్‌ముదిరాజ్, నాయకులు బాల్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, సల్ల వెంకటేష్ మండల, మున్సిపాలిటీల నాయకులు ఉన్నారు.



మేడ్చల్‌లో రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న హరివర్ధన్‌రెడ్డి, వజ్రేష్‌యాదవ్

బీజేపీ కుట్రలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

కీసర: దేశంలో మత విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయలబ్ధి పొందడానికి బీజేపీ చేస్తున్న కుట్రలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో కీసరలో నిర్వహించిన ఇంటింటికీ సీపీఐ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ముస్లిం రిజర్వేషన్లు ఎత్తివేస్తామని చెప్పడం బాధ్యతారహితమని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెంచి ప్రజలపై భారం మోపుతున్నారని మండిపడ్డారు. ఏడాదికి కోటి ఉద్యోగాలు ఇస్తామని, 9 ఏళ్లు గడుస్తున్నా ఉద్యోగాలు కల్పించడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందన్నారు. దళితులు, బీసీలు, మహిళలు, అట్టడుగు వారిపై దాడులు చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబంధు, రుణమాఫీని దశలవారీగా కాకుండా ఒకే దఫా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్.బాలమల్లేష్, మేడ్చల్ జిల్లా సీపీఐ కార్యదర్శి డీజీ సాయిల్‌గౌడ్, మేడ్చల్ నియోజకవర్గ కార్యదర్శి టి.శంకర్‌గౌడ్, కార్యవర్గ సభ్యులు లక్ష్మీ, కీసర మండల కార్యదర్శి కృష్ణయాదవ్, నేతలు రవినాయక్, రాజేశ్వరి, ప్రమీల, మాధవి, స్వరూప, లత, కవిత, లక్ష్మణ్, నాగరాజు, రాములు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న సర్కారు



అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న నేతలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: కార్మికుల హక్కులను పాలకులు కాలరాస్తున్నారని భారతీయ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జయేందర్ గౌడ్ అన్నారు. బుధవారం మేడ్చల్ కలెక్టరేట్ ప్రధాన గేట్ వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సామాజిక పద్ధతి ప్రకారం జాతీయ కార్మిక విధానాన్ని అమలు చేయాలని ఆయన కోరారు. కార్మికుల జీవన విధానానికి అనుగుణంగా వేతన విధానాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు ధనంజయగౌడ్, జాతీయ పబ్లిక్ సెక్టార్ కార్యదర్శులు శ్రీధర్, వెంగళరావు పాల్గొన్నారు 'మేడే' ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి



మే డే వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రపంచ కార్మికుల దినోత్సవం 'మే డే'ని ఘనంగా నిర్వహించాలని ఇన్సురెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్ల ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య తెలిపారు. బుధవారం నగరంలో సమావేశమైన బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగాల్లోని ఉద్యోగ సంఘాలు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్, జనరల్ ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎంప్లాయిస్ అసోసియేషన్, రిజర్వ్ బ్యాంక్ వర్కర్స్ యూనియన్, రిజర్వ్ బ్యాంక్ రిటైరీస్ అసోసియేషన్, బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, నేషనల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (నాబార్డ్) కలిసి ఉమ్మడిగా 'మే డే'ఉత్సవాల్లో భాగంగా ర్యాలీలు, సభలు, సమావేశాలు చేపట్టాలని, పోస్టర్‌ను ఆవిష్కరించారు. యూనియన్ నాయకులు మద్దిలేటి రఘు, వీరగోని రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మే డే ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

జవహర్‌నగర్: బీఆర్‌టీయూ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మే 2వ తేదీన అలియాబాద్ సీఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించే మే డే ఉత్సవాల పోస్టర్‌ను బుధవారం జవహర్‌నగర్‌లో డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులను ఆదుకున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య, జవహర్‌నగర్ అధ్యక్షుడు సాయికుమార్, నాయకులు రమేష్, సంపత్, శేషు, నగేష్, రాములు, రమేష్, చందు, కొండయ్య, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

చివరి గడువు పెంపు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాలో కొత్త పొరుగు సేవల అవుట్ సోర్సింగ్ ఏజెన్సీస్ ఎమ్పానల్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు చివరి గడువును ఈ నెల 29 వరకు పొడిగించినట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. ఏజెన్సీస్ సేవలను అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వినియోగించుకొనేందుకు వారు జిల్లా లేబర్ డిపార్టుమెంట్ నుంచి కాంట్రాక్ట్ లేబర్ లైసెన్సు తప్పకుండా తీసుకోవాలన్నారు. ఆసక్తి గల పొరుగు సేవల అవుట్ సోర్సింగ్ ఏజెన్సీస్ దరఖాస్తు చేసుకునేందుకు జిల్లా ఉపాధి కార్యాలయాన్ని సంప్రదించాలని ఆమె కోరారు.

విగ్రహాల ఆవిష్కరణకు ఆహ్వానం



మేడ్చల్: గుండ్లపోచంపల్లి మినీ ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేసిన నేతలు, మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఈనెల 7వ తేదీన ప్రారంభిస్తున్నట్లు గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ బేరి ఈశ్వర్ తెలిపారు. తాను ఏర్పాటు చేసిన జాతి నేతల విగ్రహాలను 7వ తేదీన ప్రారంభిస్తామని తెలిపారు. ఈమేరకు మంత్రి మల్లారెడ్డిని ప్రారంభోత్సవానికి ఆహ్వానించినట్లు ఆయన తెలిపారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

మేడ్చల్: వర్షాలకు దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయాధికారులు బుధవారం పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలోని మేడ్చల్, అత్వెల్లి, కిష్టాపూర్ తదితర గ్రామాల్లో ఏఓ అర్చన తమ బృందంతో కలిసి పర్యటించారు. వర్షాలకు మొక్కజొన్న, వరి పంటలకు కొద్ది మేరకు నష్టం వాటిల్లిందని ఆమె తెలిపారు. వరి పంట ఇంకా కోత దశకు రాకపోవడంతో నష్టం కొద్దిగానే జరిగిందన్నారు.

దివ్యాంగుల ఉచిత పరికరాలకు దరఖాస్తులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: జిల్లాలోని దివ్యాంగులకు ఉచితంగా రెట్రోఫిటెడ్ మోటరైజ్డ్ వాహనాలు, బ్యాటరీ వీల్ చైర్స్, లాప్ టాప్‌లు, డైసీ ప్లేయర్స్, 4జీ స్మార్ట్ ఫోన్స్, ట్రై సైకిల్స్, వీల్‌చైర్స్, చంక కర్రలు, హియరింగ్ ఎయిడ్స్, వాకింగ్ స్టిక్స్, స్మార్ట్ కేస్స్ తదితర పరికరాల కోసం దివ్యాంగుల నుంచి వచ్చే నెల 5 వరకు దరఖాస్తులు పొడిగించినట్లు జిల్లా సంక్షేమ అధికారి, మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

మహిళ ఆత్మహత్య కేసులో ముగ్గురి రిమాండ్

జవహర్‌నగర్: మహిళ ఆత్మహత్య కేసులో ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించిన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. దమ్మాయిగూడ సాయిచంద్రకాలనీలో నివసించే దున్న జ్యోతి(46) తన భర్త శ్రీనుబాబులు కుటుంబంతో కలిసి నివసిస్తున్నారు. తన భర్త, అత్తమామలు వేధించడంతో ఈ నెల 24వ తేదీన జ్యోతి ఆత్మహత్య చేసుకుంది. భర్త శ్రీనుబాబు, అత్త దున్న ఈశ్వరమ్మ, మామ రాంచందర్‌రావును బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ప్రతి గింజను కొనుగోలు చేస్తాం

జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి

ఘట్‌కేసర్: రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అన్నారు. బుధవారం మాదారం, ఏదులాబాద్‌లో అదనపు కలెక్టర్ నరసింహారెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డితో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులు నష్టపోకుండా ఏ గ్రేడ్ రకం ధాన్యానికి రూ.2,060లు, కామన్ గ్రేడ్ రకం ధాన్యానికి రూ.2,040ల మద్దతు ధర చెల్లిస్తున్నామన్నారు. అనంతరం రైతుల విన్నపం మేరకు అదనపు కలెక్టర్ నరసింహారెడ్డి వర్షంతో నష్టపోయిన వరి పంటను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టంపై నివేదికను అందజేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, పౌరసరఫరా శాఖ ఎండీ రాజేందర్, మార్కెటింగ్ మేనేజర్ పాండురంగం, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, రైతుబంధు కమిటీ జిల్లా అధ్యక్షుడు నందారెడ్డి, సభ్యుడు భిక్షపతిగౌడ్, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొండల్‌రెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, ధర్మారెడ్డి, వెంకటేశ్, ఉదయ్‌కుమార్‌రెడ్డి, సర్పంచులు వెంకటేశ్‌గౌడ్, యాదగిరి, ఉప సర్పంచ్ లింగేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ కుమార్‌ముదిరాజ్, ఆంజనేయులుముదిరాజ్, మండల వ్యవసాయాధికారి భాసిత్, సహాయ అధికారి సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.



ఏదులాబాద్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, చిత్రంలో అదనపు కలెక్టర్ నరసింహారెడ్డి

ఆరోగ్య తెలంగాణే లక్ష్యం

కార్పొరేటర్ చిత్ర సుబ్రహ్మణ్యం



17వ కంటి వెలుగులో కార్పొరేటర్ చిత్ర సుబ్రహ్మణ్యం

జవహర్‌నగర్: ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు వైద్యాన్ని అందిస్తోందని కార్పొరేటర్ అలిగిరి చిత్ర సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం 17వ డివిజన్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పేద ప్రజల వైద్యం కోసం ప్రతి పల్లె, బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేశారన్నారు. గతంలో ప్రభుత్వ దవాఖానాలకు వెళ్లాలంటే భయపడేవారని, ప్రస్తుతం అన్ని వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందజేస్తున్నారన్నారు. జవహర్‌నగర్‌లోని పేద ప్రజల కోసం మంత్రి మల్లారెడ్డి సహకారంతో బస్తీ దవాఖానాలు, ప్రైమరీ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. 17వ డివిజన్‌లో కంటి వెలుగు కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొని కంటి వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్లు, ఆశా కార్యకర్తలు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

24 గంటలూ చీకట్లోనే..

- భారీ వర్షం కారణంగా నిలిచిన కరెంటు సరఫరా
- ఓఆర్ఆర్‌పై బైఠాయించిన అర్కల్‌గూడ వాసులు
- 24 గంటలు గడిచినా పట్టించుకోలేదని ఆగ్రహం



మేడ్చల్‌రూరల్: భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం సందర్భంగా మంగళవారం రాత్రి నిలిచిన విద్యుత్ సరఫరా 24 గంటలు గడిచినా రాకపోవడంతో ఆగ్రహానికి లోనైన గ్రామస్తులు రాస్తారోకోకు దిగిన ఘటన గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి అర్కల్‌గూడలో చోటు చేసుకుంది. ఈదురు గాలులు, భారీవర్షం కారణంగా పలుచోట్ల చెట్లు విరిగి కరెంట్ తీగలపై పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రాత్రంతా చీకట్లో కాలం వెల్లదీసిన గ్రామస్తులు బుధవారం ఉదయం విద్యుత్ సరఫరా పునరుద్ధరణ అవుతుందని భావించగా విద్యుత్ సిబ్బంది సమ్మె కారణంగా పట్టించుకునే వారే లేకుండా పోయారు. బుధవారం రాత్రి 9 గంటల సమయంలో గ్రామ సమీపంలో ఉన్న ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు వాహనాల రాకపోకలను నిలిపివేశారు. గ్రామస్తుల రాస్తారోకో విషయం తెలుసుకున్న బీజేపీ కౌన్సిలర్ హంసరాణి ఘటన స్థలికి చేరుకుని గ్రామస్తులతో కలిసి నిరసనలో పాల్గొన్నారు. మేడ్చల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని రాస్తారోకో విరమింపజేశారు.